

డ్రైనేజీ అస్తవ్యస్తం
దుర్వాసనతో ఇక్కట్లు

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో ఏ.ఎల్.పురం నుండి కొంగసింగి గ్రామానికి వెళ్లే రహదారిలో అనేకచోట్ల రహదారి గోతులమయం, అలాగే డ్రైనేజీ కూడా అస్తవ్యస్తంగా ఉండడంతో దుర్వాసనతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా గుంతలు పడిన ప్రాంతంలో అంగన్వాడి కేంద్రం ఉండడంతో విద్యార్థులకు ఇక్కడ వెదజల్లే దుర్గంధ వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీలలో పూడికలు తీయకపోవడంతో మురికి నీరంతా రోడ్డుపై ప్రవహించడంతో ఈ విధంగా తయారవుతున్నాయని ప్రయాణికులు, ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా చెవిటి వాడి చెవిలో శంఖం ఊదినట్లుగా కన్నెత్తి కూడా చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా డ్రైనేజీలు పూడికలు తీయించి గోతులను పూడ్చే చర్యలు చేపట్టకపోతే అంగన్వాడి సెంటర్‌కు తమ పిల్లలను పంపించమని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పలువురు తెలిపారు.

కేజీబీవీలో హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తులు

విశాలాంధ్ర-రాంబిల్లి: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాంబిల్లి మండల విద్యా శాఖాధికారి మళ్ళ సూర్యారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 42 సంవత్సరముల వయస్సు గల మహిళా అభ్యర్థులు అక్టోబర్ 15వ తేదీ లోపు మండల కేంద్రంలో గల విద్యాశాఖా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ విజయ్ కృష్ణన్

విశాలాంధ బ్యూరో - అనకాపల్లి: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణణ్ అధికారులను ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం 1994ను కఠినంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం లింగనిష్పత్తి 1000 మంది బాలురు, 978 బాలికలుగా ఉందని, లింగ నిష్పత్తి సమానంగా ఉండాలన్నారు. బాలికలను కాపాడుకోవాలని, వారిపై వివక్ష చూపకూడదని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. చట్టం క్రింద గర్భం ధరించడానికి ముందుగాని తర్వాత గాని లింగ ఎంపికను నేరంగా పరిగణించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఏ లేబరేటరీగాని, స్కానింగ్ కేంద్రం గాని గర్భస్థ పిండం లింగాన్ని తెలిపే ఉద్దేశ్యంతో చేయరాదని ఆమె స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయిల జరిమానా విధించడం జరుగుతుందని జిల్లా కలెక్టరు తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్లైన్ గ్రీవియన్స్ (pcpndt.ap.gov.in) ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. ఆడపిల్ల విలువ అపారమని, మనమంతా కలిసికట్టుగా లింగ వివక్షతకు చరమగీతం పాడుదామని, ఆడపిల్ల రక్షణ బాధ్యత మనదే అని అన్నారు. ఏఎన్ఎమ్, ఆశాలు గృహ సందర్శనాలు, తదితర విధాలుగా ఆడపిల్లల సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా ఎంఎస్‌వికె బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 73 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కొత్తగా 11 కేంద్రాలు గుర్తింపు కొరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. స్కానింగు కేంద్రాలను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. బాలికల సంరక్షణపై ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి రమేష్, కమిటీ సభ్యులు హాజరయ్యారు.

మునగపాకలో అక్రమ కోళ్ల ఫారం నిర్మాణం

పంచాయతీ నోటీసులు ఇచ్చినా బేఖాతర్

విశాలాంధ్ర - మునగపాక: మండల కేంద్రంలో రోజురోజుకు అక్రమ నిర్మాణాల జోరు శరవేగంగా సాగుతుంది. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఎవరికి నచ్చిన రీతిలో వారు అక్రమ నిర్మాణాలను నిర్మిస్తున్నారు. దీనివల్ల పంచాయతీ ఆదాయానికి భారీ స్థాయిలోనే గండి పడుతుందనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో వాడ్రాపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో కోళ్ల ఫారం నిర్మాణం చేపట్టారు. అయితే కనీస అనుమతులు సైతం తీసుకోకుండా నిర్మాణం మొదలు పెట్టారనే ఫిర్యాదులు రావడంతో పంచాయతీ కార్యదర్శి సదరు అక్రమ నిర్మాణాన్ని సిబ్బందితో కలిసి పరిశీలించి నోటీసులు సైతం జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి నోటీసులు సైతం బేఖాతర్ చేస్తూ నిర్మాణ పనులు చేయడం విశేషం. మండల ప్రధాన కేంద్రానికి సమీపంలో మరో గ్రామానికి దగ్గరగా కోళ్ల ఫారం కోసం నిర్మాణం చేపట్టడమే పెద్ద తప్పు. కోళ్ల ఫారం నుంచి వచ్చే దుర్వాసన, ఈగలు వలన మండల ప్రధాన కేంద్రం, సమీప గ్రామాలు ఇబ్బంది పడే పరిస్థితి వస్తుంది. అవేవీ పట్టించుకోకుండా పంచాయతీ అనుమతులతో పాటు, గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల అభిప్రాయం వంటి ఏ అనుమతులు తీసుకోకుండా కోళ్ల ఫారం నిర్మాణం చేపట్టడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సదరు అక్రమ నిర్మాణ పనులను నిలిపివేయాలని, కోళ్ల ఫారం ఏర్పాటు సంబంధిత శాఖల ద్వారా గ్రామసభ నిర్వహించిన తరువాతే ప్రారంభించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని సమీప గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

పల్లెల్లో వెలుగులు నింపుతున్న ప్రభుత్వం

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - కె.కోటపాడు: గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులను మళ్ళించుకుని గ్రామాలను పూర్తిగా గాలికి వదిలేసిందని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి విమర్శించారు. పల్లె పండుగ వారోత్సవాల సందర్భంగా సోమవారం సింగన్న దొరపాలెం గ్రామంలో మాట్లాడారు. పంచాయతీ ఖాతాల్లో నయా పైసా లేకపోవడంతో గ్రామాల్లో కనీస పారిశుద్ధ్య పనులు చేపట్టలేని సర్పంచులు చివరకు జోలె పట్టి ఆందోళనలు చేసినా అభివృద్ధి పనులకు వైసీపీ ప్రభుత్వం నయా పైసా ఇవ్వలేదన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను నేరుగా పల్లె ఖాతాలకు మళ్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో 1182 పనులకు 102.12 కోట్ల నిధులు విడుదల కాగా ఒక్క మాడుగుల నియోజకవర్గానికి అత్యధికంగా 27.21 నిధులు విడుదల అయిందన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైన్లు, తారు రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో దూమా పీడీ పూర్ణిమ దేవి మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు పల్లె పండగ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధులతో చేపట్టబోయే అభివృద్ధి పనులపై గత ఆగస్టు 23న ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేయించడం జరిగిందన్నారు.

ఆ తీర్మానాల మేరకు ప్రస్తుతం శంకుస్థాపన చేసే పనులన్నీ సంక్రాంతిలోగా పూర్తి చేయవలసి ఉంటుందని అన్నారు. అనంతరం యాభై లక్షలతో చేపట్టే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అలాగే కేజీ పురంలో 19.85 లక్షలు, ఏ.కోడూరులో 45.05 లక్షలు, ఆర్‌వై అగ్రహారంలో 21.85 లక్షలు, పోతనవలసలో 20 లక్షలు, కొరువాడ గ్రామాల్లో 5 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు, రంగలి మహేష్, ఎంపీడీవో సాంబశివరావు, ఉప తహశీల్దార్ రమేష్ బాబు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

నకిలీ విలేకరుల హల్‌చల్

విశాలాంధ్ర - చోడవరం: అవసరాలో, బలహీనతో తెలియదు, వారి పేరు పూర్తిగా రాసుకోవడం, చదవడం రాదు, కానీ ప్రతీ ఒక్కరూ "విలేకరి"ని అని చెప్పుకుంటూ దందాలకు పాల్పడుతుండటం సభ్య సమాజానికి సిగ్గుచేటు అనే విమర్శలు వున్నాయి. ఇటీవల మండలంలోని ఖండేపల్లి గ్రామానికి చెందిన కలిమి చిలుకు కుమారుడు ఖండేపల్లి ప్రసాద్ సబ్బవరం మండలం లగిశెట్టిపాలెంలో ఓ రైస్ మిల్లు వద్ద ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్‌ను అని చెప్పి దందా చేయడంతో, నకి "లీల"లు బయిట పడ్డాయి. మాజీ మంత్రి, ప్రస్తుత భీమిలీ టి.డి.పి. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రధాన అనుచరుడుగా కండిపల్లి ప్రసాద్‌కు ఓ పేరు వుండటంతో భూ తగాదాలు, ఇతర లాలూచీలు సెటిల్మెంట్ చేసేవాడని గ్రామస్తులు చెబుతున్నారు. అంతేగాక ఎల్.ఐ.సి. ఏజంట్‌గా పనిచేసే వాడని చెబుతున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తే పట్టణంలో మరింత మంది నకిలీ విలేకరులు బయట పడే అవకాశం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ ప్రెస్ మీట్ చూసినా మేమూ విలేకరులమే అంటూ తండోపతండాలుగా వస్తుండటంతో ఇటీవలి కాలంలో ప్రెస్ మీట్‌లు కూడా తగ్గిపోయాయి. ప్రభుత్వ అధికారులు వారానికోసారి ప్రెస్ మీట్ నిర్వహించేవారు, వాట్స్ ఆప్‌లోనే వార్తలను పంపిస్తున్నారు. ప్రభుత్వ అధికారుల అశ్రద్ధ, నిర్లక్ష్యంతో ఈ నకిలీలు పెచ్చుమీరుతున్నారు. సోషల్ మీడియా, యూ ట్యూబ్ చానెల్ పేరుతో, ఎటువంటి అర్హత ప్రమాణాలు లేని వారు చాలా మంది విలేఖరులగా దూసుకు వస్తుండటంతో, జిల్లా కలెక్టర్ అక్రెడిటేషన్ (ప్రభుత్వ గుర్తింపు) కార్డు ఉన్న విలేకరులకు ఏమి చేయాలో అర్థం కాని తికమక పరిస్థితి ఏర్పడింది.

ఎంపీడీవోను కలిసిన పశుసంవర్ధక శాఖ సిబ్బంది

విశాలాంధ్ర - చీడికాడ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో వి.హేమచందర్‌ను పశువర్ధక శాఖ సిబ్బంది కలిసి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా హేమచందర్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. మినీ గోకులాలను పూర్తి చేసేందుకు సహకరించాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శరగడం శేషు, కొల్లి రాజేష్, సాయి, కూరచా అర్జున్ మూర్తి, శ్రీనివాస్ మాధవి పాల్గొన్నారు.

రూ.1.99 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని సీతారాంపురం, నామవరం, మంగవరం గ్రామాలలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పాయకరావుపేట మండలంలోని అన్ని గ్రామాల్లో రూ.1.99 కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నట్లు ఎంపీడీవో జయ ప్రకాశరావు తెలిపారు. ఇందులో 75 శాతం ఉపాధి హామీ పథకం నిధులు, 25 శాతం ఆయా గ్రామ పంచాయతీల నిధులతో అభివృద్ధి పనులు చేస్తారని తెలిపారు. సీతారాంపురం గ్రామంలో రూ.10 లక్షలతో, నామవరం గ్రామంలో రూ. 9 లక్షలతో, మంగవరం గ్రామంలో రూ.15 లక్షలతో రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసరపు తాతారావు, సర్పంచ్ పక్కుర్తి కృష్ణ, కురుందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ, వంగలపూడి రామారావు, గూటూరు రామ గోవిందు, కట్ట దొర, గోవిందు, పంచాయితీ రాజ్ ఏఈ కచేరి, ఏపీవో హేమలత, పంచాయతీ కార్య దర్శులు వై.సత్యనారాయణ, మల్లికార్జున చారి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. ట్రాఫిక్ సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అడపా దడపా రైడ్‌లే తప్ప శాంతి భద్రతలు, ట్రాఫిక్ క్లియరెన్స్‌పై స్థానిక పోలీసు అధికారులు శ్రద్ధ చూపలేకపోతున్నారనే బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తూరు జంక్షన్, చీడికాడ రోడ్డు, అన్నవరం, పెద్ద వెలమ వీధి తదితర ప్రాంతాల్లో నిరంతరం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా దురాక్రమణలు, దుకాణాలు ఎదురుగానే వాహనాలు అక్రమ పార్కింగ్‌తో అనేక సమస్యలు ఎదరవుతూనే ఉన్నాయి. వీటిపై చర్యలు తీసుకోవలసిన రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు మొద్దు నిద్ర నటిస్తుండటంతో, తరచూ ఇవే సమస్యలు ప్రజల్ని చుట్టుముడుతున్నాయి. ఏ ప్రభుత్వ శాఖ అధికారిని అడిగినా ఏదో వంక చూపించి, తమ తప్పును ఇతర ప్రభుత్వ శాఖలకు బదిలీ చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. ట్రాఫిక్ సమస్యని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు శ్రద్ధ వహించి, చోడవరం పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తీర్చవలసిందిగా పలు ప్రజా, మహిళా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

గుంతలను పూడ్చి, కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర-రాంబిల్లి: నేవీ ప్రధాన ద్వారం నుండి వెంకటాపురం సెంటర్ వరకు మెయిన్ రోడ్డుపై గుంతలు పూడ్చి కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీపీఎం మండల కన్వీనర్ జి.దేవుడునాయుడులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద గొయ్యిలు పడి, నేవి నిర్మాణ పనులకు వెళ్లే ఉద్యోగులతోపాటు, ఆ ప్రాంత ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, గోతుల్లో ద్విచక్ర వాహనదారులు పడి యాక్సిడెంట్లకు గురై అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేవీ నిర్మాణ పనులకు భారీ వాహనాలు రోజూ వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డుపై దుమ్ము లేచిపోయి రాంబిల్లి, గోవిందపాలెం, సంతపాలెం గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా నేవీ అధికారులు, జిల్లా ఆర్ అండ్ బి అధికారులు జోక్యం చేసుకొని గుంతలు పూడ్చి, కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే రోడ్డుపై భారీ వాహనాలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు వై.రాము, ఆర్.రాంబాబు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతి కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కోటవురట్ల: పల్లెలను ప్రగతి బాటలో నడిపించడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీనివాస్ రావు అన్నారు. పల్లె పండగ కార్యక్రమాన్ని మండలంలో కోటవురట్ల, కైలాసపట్నం, తంగేడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చేపట్టే సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణాలకు కైలాసపట్నం లో భూమి పూజ నిర్వహించారు. అనంతరం జానకి శ్రీను మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలు పూర్తి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, తహశీల్దార్ తిరుమలబాబు, ఉపాధి ఏపీవో నాగరాజు, పంచాయతీ రాజ్ జేఈ వర్మ, కైలాసపట్నం పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, టీడీపీ నాయకులు సుంకర బాబ్జి, భీముని మాణిక్యాలరావు, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ చేపల పెంపకందారులు బరితెగింపు

విశాలాంధ్ర - దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలో అక్రమచేపలు పెంపకందారులు పూర్తిగా బరితెగించేసారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న పేర్కొన్నారు. సోమవారం దేవరాపల్లి మండలంలోని కొత్త పెంట, ములకాలపల్లి, పెదనందిపల్లి, కలిగొట్ల, తారువా మారేపల్లి, గజపతి నగరం, చేనులపాలెం తదితర గ్రామాల్లో వెంకన్న విస్తృతంగా పర్యటించి అక్రమ చేపల చెరువులను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. దసరా రావడంతో గతరెండు రోజుల నుండి చికెన్ వ్యర్థాలు ఎక్కడికక్కడ విచ్చలవిడిగా దొరకడంతో చేపలను పెంపకందార్లు పూర్తిగా బరితెగింపునకు పూనుకొని ప్రతి చెరువులోని వ్యర్థాలను తీసుకొచ్చి పడేశారని అన్నారు. మండలంలోని ఎటువంటి అనుమతులు లేకుండా దాదాపుగా పదిహేను వందల ఎకారాల్లో అక్రమ చేపల చెరువులు వ్యాపారం విచ్చలవిడిగా జరుగుతుందని తెలిపారు. ఈ చెరువులన్నీ ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారస్తులకు అనువుగా ఉండడంతో రైతులకు డబ్బులు ఆశచూపించి భూములు లీజులకు తీసుకొని చెరువుల తవ్వకాలు చేపట్టారని అన్నారు. ఈ చేపలు పెంపకం కోసం మేతగా చనిపోయిన పసుమాంసం చికెన్, గొర్రెలు, మేకలు వ్యర్థాలను, బ్రాండిక్స్, పెద్ద పెద్ద హోటల్స్ నుండి వ్యర్థాలను తీసుకు వచ్చి చేపలకు మేతగా వేస్తున్నారని తెలిపారు. ఈ చేపలు తినే వారికి తీవ్రమైన రోగాలు క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు వస్తాయని తెలిపారు. దీంతోపాటు చెరువుల పక్కనే ఉన్న పశువుల పాకల కళ్ళాలతో పాటు చెరువుల్లో వృథా నీటిని పంట పొలాల్లోకి వదిలి పెడుతున్నారని దీని వలన రైతులు వరినాట్లు గాబులు తీసినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతూ కాళ్ళకు చర్మ వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. రైవాడ రిజర్వాయరు నుండి రైతులకు అందవలసిన నీళ్ళను చేపలు చెరువులకు వాడుకుంటూ రైతుల పొలాలకు నీళ్ళు లేకుండా చేస్తున్నారని తెలిపారు. ఇంతటి దౌర్భాగ్యపు పరిస్థితికి పాల్పడుతున్నప్పటికీ స్థానిక రాజకీయ నాయకులకు భయపడి అధికారులు నోరు మెదపడం లేదన్నారు. గతంలో రెవెన్యూ, పోలీసు, ఫిషరీస్, విజిలెన్స్ అధికారులు పట్టుకొని కేసులు పెట్టే వారని ప్రస్తుతం వారు కూడా పట్టించు కోవడం లేదన్నారు. లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ, ఇటువంటి ఘాతుకానికి పూనుకుంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని మరెక్కడా ఇటువంటి దౌర్భగ్యపు పరిస్థితులు లేవన్నారు. అక్రమ సంపాదనలకు ఆశపడి ఇటువంటి పనులకు పూనుకుంటూ ప్రజలు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. అనుమతులు లేని చేపలు చెరువుల పెంపకందారులపై క్రిమినల్ కేసులు పెడితే తప్ప మార్పులు రావని తెలిపారు.

ఫార్మా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ ఊర చెరువు, పెద్ద చెరువు, సన్యాసి చెరువు, మొల్లోడు గెడ్డలను కలుషితం చేస్తున్న ఫార్మా పరిశ్రమ యాజ మాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దయానిధికి ఫిర్యాదు లేఖ అందజేశారు. ఫార్మా పరి శ్రమల నుండి విడుదలవుతున్న వ్యర్థ రసాయనిక జలాలను శు ద్ధి చేయ కుండా రాంకీ యజమాన్యం నేరుగా చెరువుల్లోకి విడుదల చేస్తోందని, దీనివలన వలన చెరువులు, భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం అవుతు న్నాయని అందులో పేర్కొన్నారు. పశువులు, జీవరాసులు ఆ చెరువుల్లో నీళ్లు తాగడానికి పనికి రావడం లేదని, అలాగే భరణికం, పరవాడ, తానం, లంకెలపాలెం, తాడి, సాలాపువానిపాలెం, గొర్లివానిపాలెం, బొద్దపువాని పాలెం గ్రామాల ప్రజలు ఫార్మా కాలుష్యంతో అల్లాడుతున్నారని గనిశెట్టి వివ రించారు. చెరువులు, కాలవల్లోకి వ్యర్థ రసాన జలాలు విడుదల కాకుండా పటిష్ఠ మైన చర్యలు చేపట్టాలని కోరారు. ముత్యాలం పాలెం సముద్రంలో కూడా వ్యర్థ జలాల శుద్ధి చేయకుండా విడుదల చేయడం వలన మత్స్య సంపద మృత్యువాత పడుతుందన్నారు. ఇటీవల కాలంలో ఉప్పుటేరులో చేపలు చనిపోయాయని ఈ సందర్భంగా ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముగిసిన మద్యం దుకాణాల కేటాయింపు

విశాలాంధ్ర - అనకాపల్లి: జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణణ్ తెలిపారు. సోమవారం అనకాపల్లిలో గల సత్యలక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్ నందు మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలో 136 ప్రభుత్వ మద్యం దుకాణాలకుగాను వచ్చిన 3291 దరఖాస్తుదారుల సమక్షంలో జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణణ్ పర్యవేక్షణలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధాకర్ సిబ్బంది లాటరీ ప్రక్రియ చేపట్టారు. దుకాణాల వారీగా లాటరీ నిర్వహించి, ఎంపికైన దరఖాస్తుదారులకు దుకాణాలు కేటాయించారు. లాటరీ ప్రక్రియ ఉదయం 8 గంటలకు మొదలు పెట్టి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు కొనసాగినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధాకర్ తెలిపారు. ఈ లాటరీ ప్రక్రియలో పాల్గొనేందుకు వేలాదిగా వ్యాపారం వేలం జరిగే ప్రదేశం కిక్కిరిసిపోయింది. అనకాపల్లి జిల్లాలో గల 8 ఎక్సైజ్ స్టేషనుల పరిధిలో గొలుగుండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్కువగాను, సబ్బవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తక్కువగా దరఖాస్తులు వచ్చాయన్నారు. 136 ప్రభుత్వం మద్యం దుకాణాలు లాటరీలో వచ్చిన విజేతలు ద్వారా ఈనెల 16 నుండి నడుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి రెవెన్యూ డివిజినల్ అధికారి షేక్ ఆయిషా, ఎ.ఇ.ఎస్. టీ.రాజశేఖర్, జిల్లాలో గల ఎక్సైజ్ సి.ఐ.లు, సిబ్బంది పాల్గొన్నారు.